# సుధ నిద్ర లేచింది

☆ కె మాధురి ☆

ఎన్నో అసంతృప్తులు సుధకి జీవితంలో

అనుకున్న ప్రకారం ఇంగ్లండ్ వెళ్ళ లేకపోయారు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే ఏ సిటీలోనన్నా సెటిల్ అయ్యేపని అదీ లేకపోగా యీ వూరువాడా కానిచోట-సినిమాలూ షికార్లూ లేని చోట—కానీ డబ్బు తీసి ఖర్చుపెట్టాల్సిన అవసరంలేని చోట యిట్లా వొచ్చి పడ్డారు

"నీకు ఏ వ్యాపకం లేక యిట్లా తయారయ్యావు" అంటాడు మోహన్ ఆమె యిబ్బందులేవీ చెవినపెట్టకుండా

కాలక్షేపానికి కొన్నాళ్ళు కథా రచన మొదలుపెట్టింది ఆ పత్రికలనాళ్ళు అదేం మనుషులో వాళ్ళ నిర్వాహణ ఎంత లక్షణంగా వుందంటే వాళ్ళు వేసుకునేదీ తెలియదు పోనీ వేసుకోనిదీ తెలీదు ఎవళ్ళనని ఏం లాభం? వాళ్ళ రాజ్యం అల్లా వుంది

'మనం ఈ ఫోన్ పెట్టించుకున్నందుకే మురిసి చస్తున్నామా మా జర్మనీ బావకి మూడు ఫోన్లున్నాయి ' అంటుంది ఆమె

'మధ్యాహ్నం ఎవళ్ళో యిళ్ళు కాలిపోయాయని వొస్తే వొద్దంటున్నా వినకుండా పదిరూపాయలిచ్చారు వాళ్ళకి నిజంగా యిళ్ళు కాలినయ్యో లేదో యీ మధ్య ఇట్లా దొంగకబుర్లు చెప్పి డబ్బులు పట్టుకోవటం నేర్చారు ' అని తర్కించుకుంటుంది

'యివ్వాళ నేను చూస్తుండగానే నలుగురు రిప్రజెంటేటివ్స్ వొచ్చారు రా శాంపిల్స్ అమ్ముకుంటే ఓ మేడ కట్టొచ్చు మొన్న హైమ నాతో అనలేదూ వాళ్ళాయనకి శాంపిల్సు వొచ్చిన డబ్బుతో అది రవ్వలసెట్టు కొనుక్కుందిట" అని వాదం వేసుకుంటుంది భర్తతో

యీయనకో మనిషి కనపట్టం పాపం వాడి చేతిలో ఓ సీసా పెట్టాల్సిందే పెళ్లాం పిల్లలు ఎలా పోయినా పర్వాలేదు అదే మంటే ఇప్పుడు మనకి ఏం తక్కువైందని ప్రశ్న యీ సాధింపులు మోహన్ మరి పెంగా వింటాడు విని యీ చెవితో విని ఆ చెవితో వొదిలేస్తూ వుంటాడు

ఆ వేళ ఆదివారం మోహన్ టవున్ కెళ్ళాడు ఎప్పటిలాగే తన వాహనంమీద అతను అలా వెళ్ళినప్పుడల్లా పనిపిల్లని తోడు పడుకోబెట్టుకోవటం ఆమెకి అలవాటే వాళ్ళ యిల్లు అతి సమీపంలో వుంది ఏవేళప్పుడు పిలిచినా పలుకుతారు ఆవేళ సుధ పనిపిల్లని తోడు పడుకోబెట్టుకుంది పక్కగదిలో పిల్లలు మంచి

నిద్రలో వున్నారు ఆమెకి ఎంతకీ నిద్ర పట్టక టేప్ వేసుకుని విన్నపాటలే మళ్ళీ మళ్ళీవింది పొద్దుపోయేవరకూ పాతపుస్తకాలే, చదివిన కథలే చదివింది లైట్ఆఫ్ చేసి మాగన్నుగా కన్నుమూసింది

ఒకరాత్రివేళ పిలుపులు తలుపుమీద దబాదబా చప్పుళ్ళు ఆమెకి అలవాటే ఈ పిలుపులు అర్ధరాత్రివేళ ఏ అర్జంటుకేసో రావటం, లేదా తలనొప్పి కయినా వొచ్చి డాక్టర్ని లేపటం వాళ్ళకి అలవాటే అయితే ఆదరాబాదరా వొచ్చామని చెప్పి డబ్బులు తేవటం మాత్రం మర్చిపోతారు



రోగం ఎంత ముదరబెట్టుకుని వొచ్చినా పరవా లేదుగాని తలుపు తీసేలోపల ప్రాణం పోయినట్టు చేస్తారు.

"ఎవరూ?" అందిమంచంమీదినుంచే.

"నే నమ్మా, వేలాద్రిని" అంది బయట నుంచి

వేలాద్రి పనిపిల్ల తల్లి పనిపిల్ల పేరు తిరపతి

"ఏమిటే, ఏంకావాలి? నిద్ర మధ్యలో లేపటం మీకు బాగా అలవాటయిపోయింది" అని విసుక్కుంది

"తమరు కోప్పడతారనే ఇందాకట్నుంచీ చిన్నగా పిలుస్తున్నానమ్మా తిరపతిని తీసుకుపోదామని వొచ్చా" నందది

"ఇప్పుడేం పనొచ్చి పడింది దాంతో" అని మళ్ళా విసుక్కుంది లేచి కూచుని

"ఇందాక అన్నం తినకుండా వొచ్చిందమ్మగారూ ఎక్కడా పైసలు దొరకలేదు వాళ్ళ అయ్య పూళ్ళోకి వెళ్ళి ఏ అయ్యకాడనో డబ్బులు అడుక్కొచ్చేసరికి యీ జామైంది ఇది కూచుని కూచుని

ఆలస్యమైతే అమ్మగారు కోపం చేస్తారని వొచ్చేసింది "

"మరి యిది యిందాక తిని వొచ్చా నని చెప్పిందే నాతో" అంటూనే దానికేసి చూసింది

అల్మారు పక్కగా చాపమీద బుట్ట కింద కోడిపిల్లలా ముడుచుకుని పడుకుని వుందది దానికి పన్నెండేళ్ళుంటాయేమో ఎప్పుడయినా అది మురిగ్గా కనిపిస్తే కేక లెయ్యటం, రోజూ స్నానం చేసిందా లేదా అజ కనుక్కోవటం తప్ప—ఎప్పుడూ దాన్ని కడుపులోకి తిన్నావా అన్న పాపాన పోలేదు మరి

తలుపు తీసింది

చుట్టూ వేలాద్రి సంతానం—

"వీళ్ళంతా నిద్రపోలేదూ యింకా?"

"లేదమ్మా ఇప్పుడే అన్నం వొండి, యింత కారం నూరి వీళ్ళందర్నీ అన్నా నికి లేపా దీన్ని కూడా పిల్చుకు వెళ్దా మని వొచ్చా "

పదేళ్ళవాడూ—ఎనిమిదేళ్ళ వాడూ- ఆరేళ్ళదీ—మూడేళ్ళదీ అంతా- టైము చూపింది ఒంటి గంట

సుధకి కడుపంతా కెలకవేసి నట్లయింది

"పిచ్చి మొహం దాన్లా వున్నావే సాయంత్రం వచ్చి డబ్బులు తీసుకు పోగూడదూ?"

"నిన్నే తమరు కోపం చేశారు గదా మళ్ళా ఫస్టువరకూ రావొద్దని "

బయట అనంతంగా చీకటి పరుచుకుని వుంది లోకమంతటికీ కమ్మని నిద్రకై నిర్దేశింపబడిన యీ సమయంలో నిశా చరుల్లా వీళ్ళు—ఆకలి మొహాలతో—




చొక్కా లేకుండా వొకడూ—లాగులేని వాడొకడూ—

బీరువామీద బుట్టనిండా పళ్ళున్నాయి. అల్మారులో డబ్బాల నిండా తిను బండారా లున్నాయి అర్నెల్లకి సరిపడా బియ్యం వున్నాయి వాటికి అతి సమీ పంలో పుట్టెడు ఆకలి కడుపులో దాచు కుని యీ చిన్నది—తినని అన్నం తిన్నా నని చెప్పి, తీరని ఆకలి కప్పిపెట్టుకుని దీని కింత నిబ్బరం, గుట్టూ ఎక్కడ్నుంచి వొచ్చాయి? ఆ యీడువాళ్ళే అయిన తన పిల్లలు శుభ్రంగా తిని నిద్రపోతున్నారు వాళ్ళకీ వీళ్ళకీ ఎంత వైరుధ్యం? వేలె డంతలేని వీళ్ళకి జీవితంలో ఎంత పెనుగు లాట?

తెల్లారి లేస్తే ఆకలికి అన్నం లేని కష్టం—వొంటినిండా గుడ్డలేని కష్టం— కంటినిండా నిద్రలేని కష్టం

చీకట్లో చీకటై కలిసిపోతున్న వాళ్ళని చూస్తూ బూచిని చూసి జడసుకున్నదానిలా నిలబడిపోయింది సుధ □